# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 88 | పేజీలు : 08 | శనివారం | 04-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


### తీవ్ర అసంతృప్తి..

# మార్పు రావాలి

కాళేశ్వరం పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్న జీవన్ రెడ్డి

ప్రాణహిత జలాల విషయంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శ

భవిష్యత్ రాజకీయాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని వెల్లడి



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రారంభమై రెండేళ్లు కాకముందే "ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. గతంలో...2లో

### టీఆర్ఎస్ పేరును

# ఎవరైనా ఉపయోగించుకోవచ్చు

టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు: కవిత

తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదన్న కవిత

పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడి

బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శ



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సమితి పేరును ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదని, ఆ పేరును ఎవరైనా ఉపయోగించుకోవచ్చని...2లో



### భూములు లాక్కొని 2లో

# జైల్లో పెట్టారు

లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు: హరీశ్ రావు

గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్న హరీశ్

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం జరుగుతోందని మండిపాటు

రాష్ట్ర సమస్యలను రేవంత్ గాలికి వదిలేశారని విమర్శ




### 2047 నాటికి తెలంగాణను

# టెక్స్‌టైల్ రాజధాని లా మారుస్తాం

టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ

తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచమంతా ధరించేలా చేస్తామన్న రేవంత్

సినిమా పరిశ్రమ అవసరాలను స్థానికంగా తీర్చేలా ప్రోత్సాహం

నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలమని వెల్లడి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు.టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.....2లో






# బీఆర్ఎస్ క్లోజ్...

## ఆ పార్టీ రోడ్డున పడింది

### పీసీసీ మహేశ్ గౌడ్

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీనే నమ్ముతున్నారన్న మహేశ్ గౌడ్

కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని వ్యాఖ్య

బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని విమర్శ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో......2లో



### మూడు రోజులు

# మోస్తరు వర్షాలు

గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, జనగామ జిల్లాల్లో వర్షాలు

2లో

## స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ

ప్రైవేటుగా అభివృద్ధి చేసిన తియాన్‌లాంగ్3 ప్రయోగం

సాంకేతిక లోపం కారణంగా నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లో విఫలం

2లో



2

## గ్రూప్-1పై పిటిషన్లు

# కొట్టివేసిన సుప్రీంకోర్టు

తీర్పును స్వాగతిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి

గ్రూప్-1 ఉద్యోగ నియామకాలపై దాఖలైన పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం

భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్న సీఎం

# కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం

### విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి



2

కేరళలో రేవంత్ రెడ్డి గొప్పలు పలికారన్న కిషన్ రెడ్డి

బీజేపీపై అక్కడ తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం

తెలంగాణకు ఏం చేశారని కేరళ వెళ్లి ప్రచారం చేశారని నిలదీత

## అమిత్ షా హెలికాప్టర్ లో సాంకేతిక లోపం

అమిత్ షా అసోం పర్యటనకు అంతరాయం

హెలికాప్టర్ లో సాంకేతిక లోపం వల్ల గోలక్‌గంజ్ పర్యటన రద్దు

మొబైల్ ఫోన్ ద్వారా సభను ఉద్దేశించి ప్రసంగించిన అమిత్ షా

2



### వాళ్లు నాశనం చేశారు...

# మేము శాసనం చేశాం

ఏపీ ప్రజలకు ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ అంటూ చంద్రబాబు విమర్శలు

11 సీట్లకు పరిమితమైనా వైసీపీకి బుద్ధి రాలేదని మండిపాటు

తెలంగాణ కు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని వ్యాఖ్య

2



## భూములు లాక్కొని
# జైల్లో పెట్టారు

మొదటి పేజీ రువాయి

నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి, కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

## మూడు రోజులు
# మోస్తరు వర్షాలు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# తీవ్ర అసంతృప్తి.. మార్పు రావాలి

మొదటి పేజీ రువాయి

కేసీఆర్ పాలనపై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ ఇప్పుడు అదే తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వంపై కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకే నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలే తప్ప, పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణకు కేవలం రూ. 500 కోట్లు ఖర్చవుతాయని, కానీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ నివేదికను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమైందని, బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారుతుందని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి తెలిపారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన... మరో రెండు వారాల్లో ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

# కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం

మొదటి పేజీ రువాయి

ఆరు గ్యారెంటీల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు పలికారని, ముమ్ముందు తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, బీజేపీపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేరళ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ రెండున్నరేళ్లు కావొస్తున్నా ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏం చేశారని రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఏదో చేశామని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, అదేమిటో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

# టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

మొదటి పేజీ రువాయి

పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ డర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# బీఆర్ఎస్ క్లోజ్... ఆ పార్టీ రోడ్డున పడింది

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం" అని ఆయన జోస్యం చెప్పారు.

## గ్రూప్-1పై పిటిషన్లు
# కొట్టివేసిన సుప్రీంకోర్టు

మొదటి పేజీ రువాయి

గ్రూప్-1 ఉద్యోగ నియామకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల రాష్ట్ర ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నట్టు సీఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొలువుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట కలిగించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గ్రూప్-1 అధికారులుగా యువత భాగస్వామ్యం : ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్టశక్తుల కుట్రలను, కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్-1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసినట్టు సీఎం ప్రస్తావించారు. నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

**'గ్రూప్-1' పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు**

తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఉద్యోగాల నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎంపిక ప్రక్రియ, మూల్యాంకనంలో తప్పులున్నాయని, ఈ నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టును కోరారు. నియామకాలు కొనసాగించవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిందని, అభ్యర్థుల వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు వెల్లడించిందని పిటిషన్‌లో అభ్యర్థులు పేర్కొన్నారు. వీరి వాదోపవాదనలు విన్న జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

**హైకోర్టు తీర్పును స్వాగతించిన సీఎం**

గతంలో గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు వెలువరించిన తీర్పును సైతం సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఆ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయ పోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.

# టీఆర్ఎస్ పేరును ఎవరైనా ఉపయోగించుకోవచ్చు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత త్వరలో తన రాజకీయ పార్టీని ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి పేరు మీదనే పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని చాలామంది భావించారు. ఆ తర్వాత మరిన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా, ఆమె చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఆమె మీడియాతో మాట్లాడుతూ, పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు (టీఆర్ఎస్) ఇప్పుడు ఎవరి సొంతం కాదని గుర్తు చేశారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బీహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. పాతిక సంవత్సరాల క్రితం కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌గా మారిన విషయం తెలిసిందే.

ప్రైవేటు పాఠశాలల ఫీజులపై విమర్శలు

రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లపై ఫీజు నియంత్రణ కమిటీ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలు 8 శాతం నుంచి 10 శాతం పెంచుకోవచ్చని, కానీ 30 నుంచి 35 శాతం పెంచితే ఎలాగని ప్రశ్నించారు.

## వాళ్లు నాశనం చేశారు...
# మేము శాసనం చేశాం

మొదటి పేజీ రువాయి

రాజధాని అమరావతికి పార్లమెంట్ ఆమోదం దక్కడం చారిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఈ బిల్లుకు మద్దతు తెలపడం విశేషమని, రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీయేనని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని చూసిందని, కానీ తాము అదే అమరావతిని రాజధానిగా చేస్తూ శాసనం చేశామని సీఎం గర్వంగా ప్రకటించారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తూనే... విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. విభజన సమయంలో కూర్చోవడానికి కార్యాలయం కూడా లేని పరిస్థితి నుంచి, నేడు ఒక సుస్థిర రాజధానిని నిర్మించుకోగలిగామని గుర్తుచేసుకున్నారు. 11 సీట్లకు పరిమితమైనా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని చంద్రబాబు మండిపడ్డారు. రాజధానిని నిర్ణయించే అధికారం పార్లమెంటుకు లేదనడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. సైబరాబాద్ అభివృద్ధి సమయంలోనూ ఇలాగే విమర్శలు వచ్చాయని, కానీ నేడు అది హైదరాబాద్‌కే తలమానికంగా మారిందని ఉదాహరణగా చెప్పారు. సింగపూర్ వంటి సంస్థలపై అవినీతి ఆరోపణలు చేసి రాష్ట్రం నుంచి గత వైసీపీ ప్రభుత్వం తరిమేయడం దారుణమని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయినా, తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్లు సీఎంగా పనిచేసిన అనుభవంతో, రెండు రాష్ట్రాల ప్రజల కోసమే హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని చెప్పారు. తెలంగాణ ప్రజల గౌరవాన్ని తగ్గించే పని తానెప్పుడూ చేయనని, వారి పట్ల ఎల్లప్పుడూ గౌరవంతో ఉంటానని తెలిపారు.

# అమిత్ షా హెలికాప్టర్ లో సాంకేతిక లోపం

మొదటి పేజీ రువాయి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోం పర్యటనలో ఊహించని అంతరాయం ఏర్పడింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో దుబ్రీ జిల్లా గోలక్‌గంజ్ పర్యటన రద్దయింది. పర్యటన రద్దయినప్పటికీ, సభా ప్రాంగణానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలను నిరాశపరచకుండా అమిత్ షా ఒక వినూత్న నిర్ణయం తీసుకున్నారు. మొబైల్ ఫోన్ ద్వారా సభను ఉద్దేశించి ప్రసంగించారు. సాంకేతిక లోపం వల్ల తాను భౌతికంగా హాజరుకాలేకపోతున్నానని, ఇందుకు చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అసోం అభివృద్ధి పట్ల తన నిబద్ధత ఎప్పటికీ కొనసాగుతుందని, బీజేపీ అభ్యర్థి అశ్విని రాయ్ సర్కార్ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హెలికాప్టర్ లోపాన్ని సరిదిద్దిన తర్వాత లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ఆయన తన తదుపరి ఎన్నికల పర్యటనలను కొనసాగించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

మొదటి పేజీ రువాయి

చైనా సొంతంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయోగం విఫలమైంది. దీనితో వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాన్‌లాంగ్-3 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైంది. ఇది నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్లు సంబంధిత సంస్థ తెలిపింది. బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ 'స్పేస్ ఎక్స్' ఫాల్కన్9కు పోటీగా ఈ భారీ రాకెట్‌ను అభివద్ధి చేసింది. దీనిని ఈరోజు డాంగ్‌ఫెంగ్ కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించగా, నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే విఫలమైంది. ఇది ఫెయిల్ కావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు స్పేస్ పయనీర్ వెల్లడించింది. తదుపరి మిషన్ విజయవంతమయ్యేలా కృషి చేస్తామని తెలిపింది.

# ఆదివాసి గౌరవానికి ప్రతీకగా భారీ నిర్మాణాలకు శ్రీకారం

## కమ్యూనిటీ హాల్, కొమరం భీమ్ విగ్రహానికి శంకుస్థాపన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం, ముల్కనూర్ గ్రామంలో ఆదివాసి నాయకపోడు తెగ ఆధ్వర్యంలో ములకనూరు గ్రామంలో ఆదివాసుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే లక్ష్మీ దేవర కమ్యూనిటీ హాల్ స్వాతంత్ర్య సమరయోధుడు కొమరం భీమ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి నాయకపోడు సేనా సమితి రాష్ట్ర అధ్యక్షుడు దబ్బ సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దబ్బ సాయికుమార్ మాట్లాడుతూ, ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలు చరిత్రను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ముల్కనూరులో నిర్మించబడుతున్న ఈ కమ్యూనిటీ హాల్ కొమరం భీమ్ విగ్రహం కేవలం నిర్మాణాలు మాత్రమే కాకుండా, ఆదివాసుల ఐక్యత, ఆత్మగౌరవం మరియు గుర్తింపుకు చిరస్మరణీయ చిహ్నాలుగా నిలుస్తాయి" అని తెలిపారు. అలాగే, ఈ నిర్మాణాలను అడ్డుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు తెగ పెద్దమనిషి కొత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామంలో ఈ నిర్మాణాలు పూర్తయితే ఆదివాసి సమాజానికి మరింత గౌరవం పెరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు మరియు యువత కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్త రమేష్, గొల్ల వెంకటేశ్వర్లు, గొల్ల రాము, గొల్ల ప్రశాంతి, గొల్ల సుజాత, కొత్త స్వాతి, గొల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకపోడు మహిళా కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పుకు కూలీల తీవ్ర వ్యతిరేకత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ ప్రతినిధి :**
ఉపాధి హామీ పథకం పేరు మార్పును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కూలీలు, కార్మికులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు, అసంఘటిత కార్మికుల జాతీయ చైర్మన్ ఉదిత్ రాజ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ సూచనలతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కకేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను దెబ్బతీసే విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచి, కూలీలకు నష్టం కలిగిస్తూ కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పేదల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే రైతులు, కూలీలు, అసంఘటిత కార్మికులతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర నాయకులు మున్న జానీ, జిలాని, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్ ఖాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ ఖాన్, కాల్వల సర్పంచ్ సుజాత రామచందర్, నర్సింహుల గూడెం సర్పంచ్ భూక్య కవిత, మర్రి తండా సర్పంచ్ వి. తేజు, క్యాంప్ తండా ధరవత్ కైక, నారాయణపురం ధరవత్ యమున తదితర స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గద్దర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

## గద్దర్ పేరిట అవార్డు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు: దేశబోయిన శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :
తెలంగాణ ఉద్యమ చరిత్రలో అజరామరమైన స్థానాన్ని సంపాదించిన విప్లవ గాయకుడు గద్దర్ పోరాటం అపూర్వమని, ఆయన సేవలు ఎప్పటికీ మరవలేనివని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణానికి తెలంగాణ ఉద్యమ నాయకుడు గద్దర్ వీరఅభిమాని దేశబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ జీవిత విశేషాలు, పోరాటస్ఫూర్తిని కొనియాడుతూ, ఆయన కేవలం గాయకుడు మాత్రమే కాకుండా సమాజ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసిన మహా విప్లవకారుడని పేర్కొన్నారు. గద్దర్ గాత్రం వినోదానికి పరిమితం కాలేదని, అది ఒక ఉద్యమానికి ఆయుధంగా మారిందన్నారు. తెలంగాణ ప్రజల బాధలు, అన్యాయాలను తన పాటల ద్వారా ప్రపంచానికి తెలియజేసి, ప్రజల్లో చైతన్యం రగిలించారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఆయన గాత్రం వినిపించి ఉద్యమ స్ఫూర్తిని నింపిందన్నారు. తనపై జరిగిన కాల్పుల ఘటన తర్వాత కూడా వెనుకడుగు వేయకుండా ప్రజల మధ్య తిరుగుతూ పోరాటాన్ని కొనసాగించడం ఆయన ధైర్యానికి నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా గద్దర్‌ను తెలంగాణ జాతిపితగా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన ఆలోచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట అవార్డు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం గద్దర్ సేవలకు సరైన గౌరవమని అన్నారు.

# వంట గ్యాస్ బుక్ చేసినా రావటం లేదా,

# అసలు సమస్య - ఇలా చేయండి..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మెయిన్ డెస్క్:**
వంట గ్యాస్ కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వాలు వంట గ్యాస్ సరఫరాలో సమస్య లేదని చెబుతున్నా.. పంపిణీలో మాత్రం వినియోగదారులకు కష్టాలు తప్పటం లేదు. మూడు ప్రధాన ఆయిల్ కంపెనీల్లో ఒక్కో సంస్థ ఒక్కో విధంగా పంపిణీ చేస్తోంది. బుకింగ్ కు లాకింగ్ పీరియడ్ అమలు ద్వారా బుకింగ్స్ నియంత్రణ చేస్తున్నా.. ఆ మేర సరఫరా మెరుగు కావటం లేదు. దీంతో, పలు ప్రాంతాల్లో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా, గ్యాస్ కోసం వేచి చేస్తున్న వారి వివరాలు.. సరఫరా పై అధికారులు స్పష్టత ఇచ్చారు. వంట గ్యాస్ సమస్య లేదని చెబుతున్నా.. ప్రస్తుతం రాష్ట్రంలో 15లక్షలపైగా సిలిండర్ల డెలివరీ పెండింగ్‌లో ఉంది. వీటి సరఫరాకు వారంపైనే పట్టే అవకాశం కనిపిస్తోంది. సిలిండర్ కోసం బుకింగ్ చేసిన తరువాత వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేరడానికి తక్కువలో తక్కువగా రెండు నుంచి మూడు వారాలు పడుతోంది. డోర్ డెలివరీ ఆలస్యం అవుతుండటంతో వినియోగదారులు ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో 1.30 కోట్ల గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 2.15 లక్షల రోజువారీ బుకింగ్‌లు ఉంటాయి. రోజుకు ఐవోసీఎల్ 93 వేలు, హెచ్‌పీసీఎల్ 75 వేలు, బీపీసీఎల్ 47 వేల చొప్పున గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. యుద్ధం ప్రారంభం కాకముందు సాధారణ రోజుల్లో రాష్ట్రంలో రోజూ వారీగా 3.50 లక్షల పెండింగ్ బిల్లులు(బుకింగ్) ఉండేవి. అందులో 2.15 లక్షల సిలిండర్లు సరఫరా చేసేవారు. మిగిలినవి మరుసటి రోజున డెలివరీ చేసేవారు. కానీ, ఇప్పుడు పెండింగ్ బుకింగ్‌ల సంఖ్య 15 లక్షలకు పెరిగింది.

**15 లక్షలకు పైగా వినియోగదారుల నిరీక్షణ**
ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న వారికి సిలిండర్ డెలివరీ కావడానికి 7-8 రోజుల సమయం పడుతుంది. ఆలోపు కొత్త బుకింగ్‌ల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. సిలిండర్ల డెలివరీ వేగవంతం చేస్తే ఈ సంఖ్య కాస్త తగ్గుతుంది. వాస్తవానికి యుద్ధం ప్రభావంతో తొలి వారం, పది రోజులు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడే ఆందోళనతో బుకింగ్‌లు ఎక్కువ అయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 'సిస్టమ్ లాక్' పద్ధతిని అమలులోకి తీసుకొచ్చింది. రీఫిల్ నుంచి రీఫిల్ బుకింగ్ మధ్య గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో సింగిల్ సిలిండర్ ఉంటే... 25 రోజులు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 35 రోజుల లాక్ పెట్టింది. ఈ లాక్ టైమ్ అయిపోయిన తర్వాతే మళ్లీ సిలిండర్ బుక్ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. దీని ద్వారా రెండు నెలలు సిలిండర్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా ఇండియన్ ఆయిల్(ఐవోసీఎల్) సాఫ్ట్‌వేర్ మొరాయిస్తోంది. బుకింగ్‌లు సక్రమంగా కావడం లేదు. ఒకవేళ బుకింగ్‌లు తీసుకున్నా... సకాలంలో డెలివరీలు ఇవ్వడం లేదు. దీంతో రెండు నుంచి మూడు వారాలు సిలిండర్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.



# డోర్నకల్ విద్యార్థినికి జాతీయ స్థాయిలో అవకాశం


## రాష్ట్ర రగ్బీ పోటీల్లో ప్రతిభ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ బిషప్ గ్రౌండ్స్‌లో నవంబర్ 29 నుండి డిసెంబర్ 1 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి అండర్-17 రగ్బీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో డోర్నకల్ పి.యం. శ్రీ జెడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నల్ల మాద నవ్య శ్రీ ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నరసింహారావు, ఫిజికల్ డైరెక్టర్ కె. రవికుమార్ మాట్లాడుతూ, నవ్య శ్రీ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె డిసెంబర్ 5 నుండి 8 వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది నవ్య శ్రీను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 27వ వార్డు బస్టాండ్ ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి

## అస్వచ్ఛత, అక్రమ పార్కింగ్‌పై త్వరిత చర్యలకు హామీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, పలు వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా 27వ వార్డు బస్టాండ్ పరిసర ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్ సమీపంలోని వైన్స్ షాప్ వద్ద కొందరు వ్యక్తులు రహదారి పైనే మూత్ర విసర్జన చేయడం, అదేవిధంగా ఆటోలు, బైక్‌లు అనియంత్రితంగా పార్క్ చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం, ఎమ్మెల్యేకు వివరించారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే మురళి నాయక్, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యను గమనించి స్పందించిన ఎమ్మెల్యేకు 27వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు అస్వస్థత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
పెంచికలపేట్ మండలంలోని ఎల్లూరు గ్రామంలో గల గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో శుక్రవారం ఉదయం ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రథమ చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యార్థులను తీసుకురావడం జరిగిందన్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం 108 కి సమాచారం అందించడం జరిగిందన్నారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి రమేష్ యాదవ్, పైలట్ షణ్ముఖ వెంటనే ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను కాగజ్నగర్ ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన సమాచారం తెలియాల్సి ఉంది.

# వైభవంగా యజ్ఞోత్సవం

- ప్రతి ఒక్కరిని గౌరవించండి
- సిద్ధేశ్వరానందగిరి మహారాజ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, ఝరాసంగం :** ఆనందంగా జీవించాలంటే ధర్మమార్గాన్ని అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ధర్మం వైపు అడుగులు వేయాలని మహామండలేశ్వర్, బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆశ్రమంలో నిర్వహించిన మృత్యుంజయ మహాయజ్ఞానికి హాజరై భక్తులకు ప్రవచనామృతాన్ని అందించారు. గణపతి పూజ, యజ్ఞప్రవేశం, హోమ హవనాలు, మహిళలు చేసిన మంత్రోచ్చారణ, వేద విద్యార్థుల వేదమంత్ర పఠనం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తుల ఆనందోత్సాహాల నడుమ మృత్యుంజయ లక్షజప యజ్ఞం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మధ్యాహ్నం 2:10 గంటలకు మృత్యుంజయ యజ్ఞానికి పూర్ణాహుతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తగు ఏర్పాటు చేశారు.

# మధ్యవర్తుల నుంచి దూరంగా ఉండండి : ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి సూచన




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, నారాయణఖేడ్ :**
రైతులకు న్యాయం చేయడం, వారి పంటలకు తగిన ధర కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఎంతో శ్రమించి పండించిన పంటకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం శనగలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 5,875 మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు మధ్యవర్తులను నమ్మి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను విక్రయించి లాభపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు, సంఘం అధ్యక్షులు, నిర్వాహకులు మరియు అధికారులు పాల్గొన్నారు

# ఆదెమ్మ అనాథ కాదు మేమున్నాం: దాతలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, భద్రాద్రి కొత్తగూడెం :**
చర్ల మండలం రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన కల్లూరి. ఆదెమ్మ వయసు 86 సంవత్సరాలు మృతి చెందడం జరిగింది. వీరు వృత్తి రీత్యా నిరుపేదలు కావడంతో దహన సంస్కారాలు చేయలేని కడు నిరుపేద కుటుంబం. దహన సంస్కారాల నిమిత్తం దాతలను ఆశ్రయించగా ఆదెమ్మ అనాథ కాదు ఆమెకు మేమందరం అండగా ఉన్నామంటూ మండలంలోని దాతల అందరూ దహన సంస్కారాల నిమిత్తం 28,000 వేల రూపాయలను అందజేయడం జరిగింది. దాతల వద్ద నుండి సేకరించిన నగదును గ్రామ సర్పంచ్ జమ్ముల మురళి, మీకోసం మేమున్నాం టీం ఛైర్మెన్ లయన్ నీలి ప్రకాష్ ల చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేసిన దాతల అందరికీ గ్రామస్తులు, కుల పెద్దలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి. సూరిబాబు, తుట్టి. రాజు, గూబ. సురేష్, సుంకరి. ఆదినారాయణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి : మంత్రి దామోదర పిలుపు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, సంగారెడ్డి ప్రతినిధి:**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరవీరుడు దొడ్డి కొమరయ్య పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాటస్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమరయ్య చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను సాకారం చేయడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజాసేవలో ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన గొప్ప నాయకుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. రైతాంగ గళంగా నిలిచిన ఆయన జీవితం యువతకు ప్రేరణనిచ్చేదిగా ఉందని చెప్పారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం విలువలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు కూన వనిత, సుమలత శ్రీకాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం మల్లయ్య, జనరల్ సెక్రటరీ తాటిపల్లి పాండు, బీసీ సంఘం యువ అధ్యక్షుడు రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సరండి గ్రామంలో పంచాయతీ భవనానికి అడ్డంకులు

**అభివృద్ధి ఆశలు నీరుగారుతున్నాయి**




***హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమరం భీం ఆసిదాబాద్ జిల్లా ప్రతినిధి:***
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో అభివృద్ధి ఆశలు క్రమంగా మసకబారుతున్నాయి. గ్రామస్తులు ఎన్నో ఏండ్లుగా కలలు కన్న పంచాయతీ కార్యాలయం నిర్మాణం ఇప్పటికీ కలగానే మిగిలిపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. గ్రామపంచాయతీకి స్వంత భవనం లేకపోవడంతో ఇప్పటికీ శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది. ఒకే గదిలో గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా, కొత్తగా పంచాయతీ భవనం నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలం చుట్టూ భూ వివాదం తలెత్తింది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ స్థలం తమదేనని కంచె వేసుకుని సాగు చేస్తున్నారు. అయితే గ్రామస్తులు మాత్రం అది తరతరాలుగా గ్రామానికి చెందిన సామూహిక స్థలమని వాదిస్తున్నారు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం గమనార్హం. సర్వే చేసినా అది వివాదానికి ముగింపు తీసుకురాలేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా విచారకర విషయం ఏమిటంటే, పంచాయతీ కార్యాలయం పాఠశాల సమీపంలో ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు తరగతులు, మరోవైపు గ్రామ కార్యక్రమాలు జరుగుతుండటంతో చదువుపై ప్రభావం పడుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ భవనం నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చిన సర్పంచ్ బాపూజీపై గ్రామస్తులు ఆశలు పెట్టుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా ఆ హామీ అమలు దిశగా ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో నిరాశను పెంచుతోంది. మరోవైపు, నార్లాపూర్‌లో స్థలం ఉన్నా పంచాయతీ కార్యాలయం సరండి గ్రామంలోనే ఉండాలని గ్రామస్తులు పట్టుదలగా చెబుతున్నారు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకుని భూ వివాదాన్ని చట్టపరంగా పరిష్కరించి, సరండి గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని గ్రామ ప్రజలు, యువత కోరుతున్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మేస్త్రీల గండం

**అప్పుల పాలవుతూ, ఇబ్బందులకు గురవుతున్న లబ్ధిదారులు.....**
**మేస్త్రీలను నివారించలేని హౌసింగ్ అధికారులు.....**
**అసంపూర్తి నిర్మాణంతో అరగోస పడుతున్న మహిళలు....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదనే సామెత రాజపేట మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అచ్చుగా సరిపోతుందని చెప్పొచ్చు. ఎక్కువమంది లబ్ధిదారులు మేస్త్రీల వల్ల అనేక ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారు. అసంపూర్తి నిర్మాణాలతో అరగోస పడుతున్నారు. ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి వస్తున్నాయని సాకుతో పేదలని చూడకుండా కనికరం లేకుండా కొందరు మేస్త్రీలు వ్యవహరిస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం సమయంలో ఒప్పందం ప్రకారం మేస్త్రీలు మర్చిపోకుండా సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయకుండా డబ్బుల విషయంలో ఎక్కువగా మహిళల నుండి వసూలు చేస్తూ లబ్ధిదారులను అవస్థలు పెడుతున్నారు. ఈ విషయం సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారులకు చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొన్నిచోట్ల ఇంటి నిర్మాణం తో పాటు అదనంగా ప్రహరీ గోడ ఇతర నిర్మాణాల పేరుతో నాలుగున్నర లక్షల రూపాయలు కూడా వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఇలా అనేకమంది ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మేస్త్రీల వ్యవహారశైలిలో అనేక కష్టాలు పడుతూ ఏడుస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులు సరైన నిర్ణయము తీసుకోకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారు. అవస్థలు పడుతూనే ఉన్నారు. కొందరు మేస్త్రీలు లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక నిర్మాణాలు పూర్తి చేయకుండా ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. అనవసరంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టామని పలువురు మహిళలు వాపోతున్నారు. లబ్ధిదారుల అనాలోచిత నిర్ణయాలు, ఇంటి నిర్మాణం చేపట్టే మేస్త్రీల వ్యవహారంతో ఎక్కువమంది ఇందిరమ్మ ఇంటి నిర్మాణం లబ్ధిదారులు మంజూరి అయిన ఐదు లక్షల రూపాయల కంటే అధికంగా వెచ్చించి అప్పుల పాలవుతున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిస్థితుల పై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# ప్రమాద భరితంగా మారిన బస్సప్ప క్యాంప్ రోడ్డు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
సారపాక మేజర్ పంచాయతీలో బస్సప్ప క్యాంప్ అడ్డా దగ్గర సిసి రోడ్డు పూర్తిగా పాడైపోయి, స్థానిక ప్రజల రోజువారీ జీవితాలను కష్టతరం చేస్తోంది. ఈ రోడ్డు మీద వాహనాలు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు భారీ గుంతల వల్ల రైడర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మోటర్‌సైకిళ్లు తడబడి పడిపోతున్నాయి, కార్లు షేక్ అవుతున్నాయి, ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు మరింత బాధపడుతున్నారు. ఈ సమస్య గత కొన్ని నెలలుగా కొనసాగుతోంది. వర్షాకాలంలో నీటి వల్ల రోడ్డు మరింత దెబ్బతిని, ఇప్పుడు పూర్తిగా ఉపయోగించలేని స్థితిలో ఉంది. రాత్రి సమయంలో స్ట్రీట్ లైట్లు తక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే కొన్ని చిన్న ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. "రోడ్డు ఇలా ఉంటే మా ప్రయాణాలు భయంగా ఉన్నాది. స్థానిక ప్రజలు సర్పంచ్ శివరాం నాయక్ చొరవ తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సారపాక మేజర్ పంచాయితీ అధికారి ఈ రోడ్డు రిపేర్ పనులకు తక్షణ చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన సి సి రోడ్డుగా మళ్లీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. "సర్పంచ్ మాకు ఇచ్చిన హామీల ప్రకారం ఈ రోడ్డును మరుమత్తు చేయాలని స్థానికులు తెలుపుతున్నారు. ఈ రోడ్డు మేల్కొల్పితే సారపాక మేజర్ పంచాయితీ ప్రజల ప్రయాణాలు సులభతరమవుతాయి, ప్రమాదాలు తగ్గుతాయి, గ్రామంలోని వ్యాపారాలు మెరుగుపడతాయని స్థానికులు ఆశిస్తున్నారు. పంచాయితీ నిధులను ఉపయోగించి త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. అధికారులు స్పందిస్తే గ్రామ ప్రజలు సంతోషిస్తారని, లేకపోతే మరిన్ని కొన్ని చర్యలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



# ఆదివాసీ గ్రామాల్లో నీటి సమస్యపై చర్యలు అవసరం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కాగజ్‌నగర్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ, వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు.మే నెలలో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి సమాచారం సేకరించి కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించాలని కోరారు. రహదారి సదుపాయాల లేమితో అంబులెన్స్ చేరలేని గ్రామాలు ఉన్నాయని, వాటిని అత్యవసరంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ సమస్యలను గుర్తించేందుకు కార్యకర్తలు పర్యటనలు చేపట్టాలని, ప్రజలు తమ సమస్యలను వెల్లడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య చరిత్రను భావితరాలకు అందిద్దాం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమాదేవి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య సేవలను భావితరాలకు చేరవేయాలని అన్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో కొమురయ్య కీలక పాత్ర పోషించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినట్టు తెలిపారు. మహనీయుల సేవలను గుర్తుచేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

# దొంగల బీభత్సం... పలు ఇళ్లలో చోరీ

## బెంబేలెత్తుతున్న సారపాక ప్రజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక మేడే కాలనీలో దొంగలు బీభత్సం సృష్టించారు. దొంగలు బీభత్సంతో పలు ఇళ్లలో నగదు వస్తువులు  దొంగతనం జరిగిందని వారు అన్నారు. ఎండాకాలం వచ్చిందంటే భయం గుప్పెట్లో ప్రజలు బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలుస్తుంది. దీనికి కారణం సారపాక పట్టణం కావడం వివిధ ప్రాంత ప్రజలు ఇక్కడ నివసించడం ఒక ఎత్తు అయితే గతంలో కూడా మోటర్లు రాగి వైర్లు వివిధ ప్రాంతాలలో బైక్లు కూడా దొంగతనం జరిగిన ఘటనలో చాలా ఉన్నాయి. మరో ప్రక్క నిఘా నేత్రాలు కూడా అసలు ఉన్నాయా లేవా అనే పరిస్థితులు నెలకొన్నాయి ఇకనైనా నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణం ధన నష్టం జరగకుండా చూడవలసిందిగా పోలీస్ వారిని ప్రజలు కోరుకుంటున్నారు.

# పాంగిడిగూడలో పోలీసుల అవగాహన కార్యక్రమం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా  సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగిడిగూడ గ్రామంలో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై సైబర్ నేరాలు, గుడుంబా, గంజాయి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుడుంబా, గంజాయి సంబంధిత కార్యకలాపాలు నేరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఆసిఫాబాద్ పట్టణంలోని రోస్ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్  హాజరై, నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి పెట్టాలని, అట్టడుగు వర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తున్నామని, జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీరాం ఫుడ్స్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ బేకరీ ఫౌండర్ కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో చర్లపల్లిలో నెలకొల్పిన శ్రీరామ్ బేకరీ ఫుడ్ స్వీట్ ను శుక్రవారం మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ రామ్మోహన్ లు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన విజయకుమార్ రెడ్డి హైదరాబాద్ నగరంలో శ్రీరామ్ బేకరీ ఫౌండర్ గా వ్యాపారంలో రాణించడం  అభినందనీయమన్నారు. సందర్భంగా విజయ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మల్లాపురం మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు గిరెడ్డి ముకుంద రెడ్డి, రాజపేట మాజీ వైస్ ఎంపీపీ రాపోలు రేణుక రామిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి రాపోలు కవితా తిరుపతిరెడ్డి, బిజెపి మండల నాయకులు గిరెడ్డి జితేందర్ రెడ్డి, గిరెడ్డి దామోదర్ రెడ్డి, కట్కూరి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు

# నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మద్యపానం పైన అవగాహన సదస్సు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) పాతట్లగూడ, శివపురం లో నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ సభ్యురాలు గడ్డం లక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించాలని ఎక్సైజ్ సి ఐ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ ఐ ఇందురి సురేష్ అధ్యక్షతన గ్రామస్థులకు గుడుంబా, బెల్ట్ షాపులు, మత్తు పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పల్లెలు పట్టణాలకు పట్టుబొమ్మలని ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గుడుంబా నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత గ్రామస్థులపైన ఉందని గ్రామస్థులు సహకరించాలని తెలియచేశారు. సిర్పూర్ (టి)పోలీసులు ఎ ఎస్ ఐ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామస్థులు గుడుంబాను గ్రామంలోని రాకుండా చూడాలని, దానికి ఎవరు బానిసలు కావద్దు అని ఏమైనా ఇబ్బందులు తలెత్తే పోలీసులను సంప్రదించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు వారి సమస్యలను తెలియచేశారు. అందరం కలిసికట్టుగా ఉంది ఈ మహమ్మారిని గ్రామం నుండి తరిమేస్తామని గ్రామస్థులు తెలిపారు. వీరికి నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ సభ్యులు అండగా ఉంటామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ ఇందూరి సురేష్, కానిస్టేబుల్ కె.లింగయ్య, ఎ.రవి మరియు సిబ్బంది. పోలీస్ శాఖ నుంచి ఎ ఎస్ ఐ రాజశేఖర్, పోలీస్ కానిస్టేబుల్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్ సభ్యులు గడ్డం లక్ష్మీ, గాడిపెల్లి వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్ మరియు మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాసిమెట్ట ఆశ్రమ పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్య, భోజనం, సదుపాయాలపై సమీక్ష**
**100% ఫలితాలపై దృష్టి పెట్టాలని సూచన**



***హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:***
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయల నిల్వ గది, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు పరిశీలించి, తాగునీరు, మెను ప్రకారం భోజనం అందుతున్నదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన, ఉపాధ్యాయుల హాజరు, సమయపాలనపై విచారించారు. పదో తరగతిలో 100% ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. తనిఖీ సమయంలో ప్రధానోపాధ్యాయుడు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని కలెక్టర్ సూచించారు

# డోర్నకల్ మున్సిపాలిటీలో 11వ , వార్డు తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ మున్సిపాలిటీ 11వ వార్డులో శుక్రవారం వాటర్ పైప్ లీకేజీ కారణంగా తాగునీటి సమస్య ఏర్పడింది. సమస్యను గమనించిన స్థానికులు వెంటనే మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్మన్ మదా లావణ్య శ్రీనివాస్, సమస్యను తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన మున్సిపల్ పాలకవర్గం, 11వ వార్డు కౌన్సిలర్ కేశబోయిన సంధ్య వెంకటేష్ ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపట్టి లీకేజీని సరిచేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్మన్ మదా లావణ్య శ్రీనివాస్,11 వార్డు కౌన్సిలర్ కేశబోయిన సంధ్య వెంకటేష్‌కు స్థానిక ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాకు నూరు శాతం అడ్డుకట్ట

**కార్యాలయంలో ఎప్పటికప్పుడు ఫైళ్ల పరిష్కారం**
**మూడు నెలల్లోనే రెవెన్యూ వ్యవస్థలో భారీ మార్పులు**
**తహసిల్దార్ వల్లపు ప్రదీప్ రాకతోనేనన్న మండల వాసులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల తహసిల్దార్ కార్యాలయం పరిధిలో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యాలయం పై, ఉద్యోగులపై ఉన్న అపప్రద తొలగిస్తూ విధుల్లో చేరిన కేవలం మూడు నెలల్లోనే అనేక మార్పులు తీసుకొచ్చిన వల్లపు ప్రదీప్ ప్రజల మన్ననలు పొందాడు. జనవరి ఏడవ తేదీన పూర్తి అదనపు బాధ్యతలతో రాజపేట తహసిల్దార్ గా వల్లపు ప్రదీప్ చేరిన క్షణం నుండే ప్రక్షాళన దిశగా అడుగులు వేశాడు. మండలంలో పట్టిపీడిస్తున్న, రెవెన్యూ శాఖకు తలనొప్పులుగా మారిన అక్రమ ఇసుక రవాణా పై పూర్తిస్థాయిలో వేగంగా అంచలంచెలుగా కొరడా ఝులిపించారు. ఫోన్ ద్వారా సమాచారం వచ్చిన వెంటనే పోలీసుల సహకారంతో, రెవెన్యూ కార్యాలయంలోని ఉద్యోగులతో కలిసి అక్రమ ఇసుక రవాణా పై కేసుల నమోదు చేశారు. అర్ధరాత్రి వేళ, వేకువ జామున సమయాల్లో, సెలవు రోజుల్లో వాగుల నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న విషయాన్ని తెలుసుకొని వెంటనే ట్రాక్టర్లను పట్టుకొని పైరవీలను పక్కన పెట్టి కేసులు పెట్టి జరిమానాలను తహసిల్దార్ విధించారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్లు వేగంగా చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయకుండా పూర్తిగా నిరోధించారు. సర్టిఫికెట్ల కోసం వివిధ పనుల కోసం తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి వెంటనే స్పందించి వారి సమస్యలు తహసిల్దార్ వల్లపు ప్రదీప్ పరిష్కారం చేశారు. కార్యాలయంలోని పూర్తిస్థాయి ఉద్యోగులు కూడా తమ విధులను నిర్వహిస్తూ తహసిల్దార్ వెంట ఉండి విధులు సక్రమంగా నిర్వహించారు. దీంతో మూడు నెలల్లోనే రాజపేట తహసిల్దార్ కార్యాలయం పై గతంలో ఉన్న విమర్శలు ఆరోపణలు అనుమానాలకు తెరపడింది. రాజపేట తహసిల్దార్ వల్లపు ప్రదీప్ బృందంపై మండలంలో సదాభిప్రాయం రావడంతో పాటు తహసిల్దార్ కార్యాలయం పై నమ్మకం ఏర్పడింది. అధికార అఖిలపక్ష పార్టీల నాయకుల సైతం వల్లపు ప్రదీప్ కు సహకరించి ప్రశంసించడం విశేషం.



# నీళ్లిచ్చిన పాపానికి నరకం.. ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచారం

**పల్నాడు జిల్లా మాచర్లలో దారుణం ఘటన**
**నీళ్లు అడిగే నెపంతో ఇంట్లోకి ప్రవేశించిన ఓ కామాంధుడు,**
**ప్రభుత్వ ఉద్యోగినిపై కత్తితో బెదిరించి ఏకంగా అత్యాచారాం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, ఏ.పి బ్యూరో :** దాహమని వచ్చిన వాడికి గుక్కెడు నీళ్లు ఇవ్వబోయినందుకు ఓ ఇల్లాలికి అంతులేని అన్యాయం జరిగింది. పల్నాడు జిల్లా మాచర్లలో ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగినిపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన స్థానికంగా పెను సంచలనమే రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. సత్తెనపల్లికి చెందిన సదరు మహిళ మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, రైల్వే స్టేషన్ సమీపంలోని 13వ వార్డులో ఒంటరిగా నివసిస్తున్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే కావడంతో సొంతూరు వెళ్లేందుకు ఆమె సిద్ధమవుతున్నారు. సరిగ్గా అదే సమయంలో సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఆమె ఇంటి తలుపు కొట్టాడు. ఎండ తీవ్రంగా ఉందని, తాగడానికి కొన్ని మంచినీళ్లు కావాలని ప్రాధేయపడ్డాడు. మానవత్వంతో ఆమె లోపలికి నీళ్లు తేవడానికి వెళ్లగా.. వెంటే దూరిన ఆ మృగాడు తన అసలు రూపాన్ని బయటపెట్టాడు. వెంట తెచ్చుకున్న కత్తిని ఆమె మెడపై పెట్టి ప్రాణహాని తలపెడతానని బెదిరించాడు. అంతటితో ఆగక, ఆమె చున్నీతోనే కాళ్లు, చేతులు కట్టేసి క్రూరంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ కిరాతకుడు చేసిన దాడికి ఆమె స్పృహ కోల్పోయింది విషయం బయటపడింది ఇలా.. బాధితురాలి దత్తత కుమారుడు ఆమెకు ఫోన్ చేయగా.. ఎంతకీ స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి తన స్నేహితులను ఇంటికి పంపాడు. వారు వెళ్లి చూడగా వివస్త్రగా, గాయాలతో పడి ఉన్న బాధితురాలిని చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేట ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. పోలీసులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. దాహమని వచ్చిన వాడికి నీళ్లిస్తే.. ఇలాంటి ఘాతుకానికి పాల్పడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# సీసీ కెమెరాలే సాక్ష్యం..
# దొంగతనం కేసును వేగంగా ఛేదించిన కంగ్టి పోలీసులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 03, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలో కంగ్టి మండలం పరిధిలో జంమ్గి (కే) హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్ పక్కన ఉన్న ఒక ఇంటి లో నిన్న జరిగిన దొంగతనం కేసులో పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితురాలు వాడిత్య సౌందర్య (21 సంవత్సరాలు), ఎం.సి నాయక్ కుమార్తె, కంగ్టి మండలం జామగట్టి బి తండాకు చెందినదిగా గుర్తించారు. వివాహం అయినప్పటికీ భర్తతో వేరుగా ఉంటూ జులాయి జీవితం గడుపుతూ తిరుగుతుందని, గతంలో సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. జైలు నుండి బయటకు వచ్చిన తరువాత గోవాకు వెళ్లాలనే ఆలోచనతో డబ్బుల కోసం మళ్లీ దొంగతనం చేయాలని నిర్ణయించుకుని, 01-04-2026 న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో యంపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో ఉన్న యాసం సంతోష్ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాలో ఉన్న బంగారం మరియు నగదును దొంగిలించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సీసీటీవీ ఆధారంగా విచారణ జరిపిన పోలీసులు ఈ రోజు నిందితురాలిని అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుండి సుమారు 8 తులాలు 5 గ్రాముల బంగారం, రూ. 1,10,000 నగదు, ఒక మొబైల్ ఫోన్ మరియు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి దొంగతనాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించగా, ప్రజలు తమ ఇళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



# హైదరాబాద్‌లో అమానుషం..
# భర్త మరణం తర్వాత అత్తగారింట్లో కోడలికి నో ఎంట్రీ!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, రంగారెడ్డి డెస్క్:** కట్టుకున్న భర్త కాలం చేస్తే ఆ ఆవేదనలో ఉన్న కోడలిని అక్కున చేర్చుకోవాల్సిన అత్తమామలు.. ఆమెను గడప దాటనివ్వకుండా అమానుషంగా ప్రవర్తిస్తున్న ఘటన హైటెక్ సిటీ నడిబొడ్డున వెలుగుచూసింది. మాదాపూర్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే.. బాధితురాలు దీన కుమారి వివరాల ప్రకారం.. తన భర్త మరణించిన తర్వాత అత్తమామల వైఖరి పూర్తిగా మారిపోయింది. “కొడుకు పోయాక నీతో మాకేం సంబంధం?” అంటూ ఆమెను ఇంట్లోకి రానివ్వకుండా గేట్లు మూసేశారు. కనీసం తన సామాన్లు తీసుకోవడానికి కూడా అనుమతించకుండా అమానుషంగా వ్యవహరిస్తున్నారు.

**పిల్లలకూ తప్పని అవమానం..**

అంతటితో ఆగకుండా, తమ రక్తానికి వారసులుగా పుట్టిన మనవలు, మనవరాళ్లను సైతం అత్తగారి కుటుంబం గుర్తించడానికి నిరాకరిస్తోంది. ఓ తల్లికి ఇంతకంటే అవమానం ఏముంటుందని బాధితురాలు కన్నీరుమున్నీరవుతోంది. న్యాయంగా తనకు దక్కాల్సిన హక్కు కోసం, పిల్లల భవిష్యత్తు కోసం దీన కుమారి గత 20 రోజులుగా అత్తవారింటి ముందే చలిలో, ఎండలో కాలం గడుపుతోంది. ఇంటి బయటే ఉంటూ తన గోడును వెళ్లబోసుకుంటోంది. ఎన్నిసార్లు వేడుకున్నా అత్తగారి వైపు నుంచి స్పందన లేకపోవడంతో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. “నా భర్త లేని లోటు తీర్చలేనిది. కానీ ఉన్న ఇద్దరు పిల్లలతో నేను ఎక్కడికి వెళ్లాలి? పోలీసులు, మహిళా సంఘాలు స్పందించి మాకు న్యాయం చేయాలి,” అని దీన కుమారి వేడుకుంటోంది.



# బోగ లత నివాస గృహంలో సామూహిక పారాయణం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పౌర్ణమి సందర్భంగా రాజపేట మండల కేంద్రంలోని బోగ లత నివాస గృహంలో గురువారం రాత్రి సామూహిక పారాయణ కార్యక్రమం నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లలిత సహస్ర పారాయణం, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు సామూహికంగా నిర్వహించారు. అనంతరం మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. జై శ్రీమన్నారాయణ భక్త బృందం తో పాటు పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి పౌర్ణమి రోజున సాయంత్రం ఒక భక్తురాలి ఇంట్లో పారాయణం కొనసాగిస్తున్నారు

# ఘనంగా గురుజువడలో గుడ్ ఫ్రైడే వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, జహీరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో క్రైస్తవ మతానికి అత్యంత పవిత్రమైన రోజు అయిన గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మెథడిస్ట్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, యేసు క్రీస్తు శిలువ వేయబడిన సంఘటనను స్మరించుకున్నారు. చర్చిలో పశ్చాత్తాప సేవలు, క్రూసు మార్గం కార్యక్రమాలు నిర్వహించగా, విశ్వాసులు ఉపవాస దీక్షలు పాటించారు. యేసు క్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, త్యాగ సందేశాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పాస్టర్ జీ. రెవరెండ్ సమృద్ధి తన సందేశంలో పేర్కొన్నారు. “ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపిన రోజు గుడ్ ఫ్రైడే. యేసు చూపిన మార్గంలో నడుచుకుంటూ ప్రేమ, సహనం, క్షమ గుణాలను అలవర్చుకోవాలి” అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్‌తో పాటు గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరజీవి దొడ్డి కొమురయ్య స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలి

**బీసీ సంఘం నేత జూకంటి ప్రవీణ్ కుమార్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దొడ్డి కొమురయ్య సాగించిన పోరాటం అజరామరమైందన్నారు. పీడిత వర్గాల విముక్తి కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ సమాజం ముందుకు సాగాలన్నారు. అ మహనీయుని స్మారకార్థంగా హైదరాబాదులో స్మారక కేంద్రంతో పాటు ట్యాంక్ బండ్ పై నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కురుమ సంఘం నేతలు గౌర బక్కయ్య, రేగు సిద్ధులు, జన్నె సిద్దులు, ఎమ్మ శ్రీను, కోరే వెంకటయ్య, పోసుగొండ మధు, రావుల ఉపేందర్, వివిధ సంఘాల నేతలు నెమిల కేదారి గౌడ్, రేగు శ్రీశైలం, కొజ్జిగ వీరయ్య, ఏమ్మ బాలరాజు, కొలనుపాక బాలయ్య, కర్రె కిష్టయ్య, బైకని బిక్షపతి, బచ్చని నర్సింలు, దయ్యాల రవి, బండి స్వామి, కనకయ్య, జూకంటి సిద్దులు నారపాక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో గుడ్ ఫ్రైడే వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని మిరాకిల్ ప్రేయర్ చర్చ్ లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. ప్రార్థనలు కృతజ్ఞత స్తుతులు స్తోత్రయాగములు కీర్తనలతో ఉపవాసములతో ప్రభువును ఆరాధించారు. అనంతరం దివ్య సందేశం అందించారు. సర్వ మానవాళి పాప పర్యార్థం, లోక కళ్యాణం కొరకు సృష్టికర్త అయిన దేవుడు నశించిపోయిన మానవుల కొరకు కన్య గర్భమందు జన్మించి యజ్ఞ పురుషుడిగా బలి పశువుగా వధింపబడు, వధకు తేబడు గొర్రె పిల్ల వలె సిలువ వేయబడి ఆయన మూడున్నర సంవత్సరాల సేవా పరిచర్యలో అనేక దివ్య సందేశాలు ప్రపంచానికి ఇచ్చి చివరిగా సిలువ మీద ఏడు మాటల సందేశం ఇచ్చారు. సందేశం గూర్చి క్రైస్తవ భక్తులకు సాక్షి పాత్ర మినిస్ట్రీ మిరాకిల్ ప్రేయర్ చర్చి సంఘ వ్యవస్థాపకులు బ్రదర్ జి పాల్ రెడ్డి ఇట్టి ఏడు మాటల వివరణ అందించారు పాస్టర్ సురేష్ ప్రార్థనలతో తదుపరి పండ్లు పలహారములు కూల్ డ్రింక్స్ అందజేశారు. కొందరు 40 రోజుల ఉపవాస ప్రార్థన ముగించుకున్నారు. అనేక క్రీస్తు భక్తులు పాల్గొన్నారు. భక్తులైన వారిలో ముఖ్యులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్తేరు లోదియా, రూతు, పరిమళ, నయోమి, దివ్య, షారోను, జక్కయ్య, జకరయ్య, యోబు, సుధారాణి, హేమలత, కరుణ దేశ రాష్ట్ర గ్రామాల నాయకుల అధికారుల క్షేమ జీవితం కొరకు ప్రార్థించారు.



## సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: సర్పంచ్ ప్రియాంక రాజేందర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, ప్రాధాన్యత క్రమంలో వాటిని గుర్తించి అధిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని గురుజువాడ గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు తొలగి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం టెంకాయ కొట్టి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జంగం పౌల్ దినాకర్, మ్యాతారి నర్సింలు, రెవరెండ్ జి. సమృద్ధి, గ్రామ పెద్దలు, కాలనీ నివాసులు పాల్గొన్నారు.



## గొంతు నొక్కారు.. కానీ ఓడించలేరు: ఆప్‌కు రాఘవ్ చద్దా స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, వెబ్ డెస్క్:** ఆమ్ ఆద్మీ పార్టీలో గత కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత పోరు ఒక్కసారిగా బద్ధలైంది. పార్టీలో నెంబర్ 2 స్థానం కోసం పోటీ పడ్డారని భావిస్తున్న రాఘవ్ చద్దాను రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పదవి నుంచి తొలగించడమే కాకుండా, పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కూడా లేకుండా పార్టీ ఆంక్షలు విధించడంపై రాఘవ్ చద్దా తొలిసారి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నన్ను నిశ్శబ్దంగా ఉండేలా చేశారు కానీ, నేను ఓడిపోలేదు' అని అన్నారు. పార్లమెంట్‌లో తన గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు. తాను మౌనంగా ఉన్నానంటే అది తన బలహీనత కాదని, అదొక నిరసన అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజా సమస్యలు లేవనెత్తడం తప్పా?**

సొంత పార్టీ తనపై తీసుకున్న చర్యలను రాఘవ్ చద్దా నేరుగా ప్రశ్నించారు. తాను పార్లమెంట్‌లో సామాన్యుల పక్షాన నిలబడి మాట్లాడానని గుర్తు చేశారు. గిగ్ వర్కర్ల కష్టాలు, విమాన ప్రయాణ చార్జీల బాదుడు, సామాన్యుల జేబుకు చిల్లు పెట్టే ప్రభుత్వ నిర్ణయాలపై గళమెత్తానని తెలిపారు. 'ప్రజా సమస్యలపై మాట్లాడటం తప్పా? నా వల్ల సామాన్యులకు మేలు జరిగిందే తప్ప ఎవరికీ నష్టం కలగలేదు'అని రాఘవ్ చద్దా భావోద్వేగానికి లోనయ్యారు.



# శ్రీ శారద విద్యాలయం ను ప్రారంభోత్సవం చేసిన శ్రీ రమానంద

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పొట్టిమర్రి వద్ద శ్రీ శారద విద్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా మరియు వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభ సందర్భంలో ప్రధాన ధర్మకర్తగా శ్రీ రమానంద గురువు (శ్రీ సాయి దత్త పీఠాధిపతులు) హాజరై, పాఠశాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి మరియు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, బండిరాజుల శంకర్, జిల్లా సంఘచాలకులు బధం ప్రకాశ్ జీ, మరియు కాసము సత్యనారాయణ ఆర్ఎస్ఎస్ నల్గొండ విభాగ ప్రచారక్ అలాగే తాడెం పాండు, కామటం రమేష్, కటుకం నామదేవ్, బొగ పాండురంగం, కటుకం లక్ష్మణ్ మరియు రఘునాథపురం గ్రామానికి చెందిన అనేక మంది ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన విలువలు, నైతిక విద్య మరియు ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించాలనే సంకల్పాన్ని నిర్వాహకులు వ్యక్తం చేశారు. ఈ విద్యాలయం ద్వారా గ్రామంలోని పిల్లలకు మంచి విద్యతో పాటు సద్గుణాలు పెంపొందించే అవకాశం కలుగుతుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతీ ఒక్కరు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సంకల్పించగా, కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.




## బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి

### ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఆహ్వానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రం నవభారత్ కాలనీలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఏప్రిల్ 05, 2026 ఆదివారం రోజున ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ని ఆహ్వానించేందుకు నవభారత్ కాలనీ పెద్దలు, యువకులు కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. మందకృష్ణ మాదిగ ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించి కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నవభారత్ యువజన సంఘం వారు కోరారు.



## రాజపేట వాసి కాసోజు నాగభూషణం చారికి సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట వాసి కాసోజు నాగభూషణం చారి కి ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణి ఘనంగా సత్కరించారు. శ్రీ స్వరాంజలి మ్యూజికల్ ఈవెంట్స్ పై హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శ్రీనివాస్ చారి పుట్టినరోజు వేడుకలు జరిగిన సందర్భంగా నాగభూషణం చారి కి సత్కారం జరిగింది. ఈ వేడుకలో పలువురు రాజకీయ సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయని శోభారాణి మాట్లాడుతూ కార్యక్రమం పట్ల చాలా సంతోషంగా ఉందని పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురించి మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ నాయకులది కాదు



**తుర్కపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తుర్కపల్లి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య గురించి మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని తుర్కపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ తీవ్రంగా విమర్శించారు. తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హత లేని బీఆర్ఎస్ నాయకులు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై చేసిన ఆరోపణలు అసత్యమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయని, పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఆ ప్రాజెక్టు అవినీతి అంశాలు వెలుగులోకి వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆలేరు ప్రాంతానికి వస్తున్న నీళ్లు గతంలో స్వర్గీయ డాక్టర్ వైఎస్సార్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్టుల ఫలితమని తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వంత ఖర్చులతో సుమారు 100 చెరువులను నింపుతూ, రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అర్థంలేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. అలాగే సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా నాయకుడు బీర్ల ఐలయ్య గురించి మాట్లాడే స్థాయి కొందరు బీఆర్ఎస్ నాయకులకు లేదని విమర్శించారు. ఎమ్మెల్యే కృషితో 3700 ఇందిరమ్మ ఇళ్లు మంజూరై పేదల సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. వాసలమర్రి గ్రామంలో సుమారు 200 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, విద్యాభివృద్ధి కోసం తుర్కపల్లి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు పాలించిన 10 ఏళ్లలో ఆలేరు అభివృద్ధి వెనుకబడిందని, ప్రస్తుతం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాయకత్వంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. ప్రజల మద్దతుతో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 80 శాతం స్థానాలు గెలుచుకోవడం, మున్సిపాలిటీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను గ్రహించి అనవసర ఆరోపణలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా సర్పంచుల ఫోరం ప్రచార కార్యదర్శి భూక్య రాజారామ్ నాయక్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టు నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు ధనావత్ భాస్కర్ నాయక్, డీసీసీ కార్యదర్శి ధనావత్ మోహన్ బాబు నాయక్, సీనియర్ నాయకులు ఐనాల మహేందర్ రెడ్డి, ఎన్.ఎస్.యూ.ఐ ఆలేరు అధ్యక్షులు గడ్డమిది నిఖిల్ గౌడ్, నాయకులు బాలు యాదవ్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి నివాసంలో మదర్ డెయిరీ మౌలిక వసతుల విస్తరణ సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ లోని ఆయన నివాసంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైయిరీ ఢిల్లీ చైర్మన్ జయతీర్థా చారి తో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పాడి పరిశ్రామిభివృద్ధి పైన చర్చించారు. రాష్ట్రంలో మదర్ డైయిరీ, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాలు ఉత్పత్తి పెంపు, రైతులకు ప్రోత్సాహకాలు, మదర్ డెయిరీ మౌలిక వసతుల విస్తరణ, సహకార సంఘాల బలోపేతం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. అలాగే డెయిరీ రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంపై కూడా దృష్టి సారించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు



# బేకరీ అంటేనే భయపడేలా ఉంది..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 03, రంగారెడ్డి :** ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా బేకరీ ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తున్న ఒక బేకరీ యజమానిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సుమారు రూ. 3 లక్షల విలువైన అనారోగ్యకరమైన ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు, కనీస పరిశుభ్రత లేకుండా తయారు చేసిన ఈ ఉత్పత్తులను నగరంలోని పలు కిరాణా దుకాణాలు, కేఫ్‌లు, చిన్నచిన్న హోటళ్లకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేసిన ఈ కల్తీ/సురక్షితం కాని ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. బేకరీపై జరిపిన తనిఖీల్లో సుమారు 3 లక్షల రూపాయల విలువైన బేకరీ వస్తువులను, వాటి తయారీకి వాడే ముడిసరుకును అధికారులు సీజ్ చేశారు.

# స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012 - 2013,వ సంవత్సరం 10వ తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు జంగా ప్రియ వారి అమ్మ ఇటీవల అనారోగ్యంతో జంగా లక్ష్మి చనిపోవడం జరిగింది. వారి ధశదిన కర్మలో జంగా లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తోటి మిత్రురాలిని పరామర్శించి 10,700 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సతీష్ గౌడ్, నర్రా శివాజీ, శ్యామల శ్రీకాంత్, ఏళ్ల క్రాంతి, శ్రీధర్, మద్దూరి ఉమేష్, చిట్టబోయిన ప్రవీణ్, జివాజీ ప్రదీప్, గంగరబోయిన ప్రదీప్, జంగా యాదగిరి, జంగా పరుషరాములు, తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో ఘనంగా దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం, ఉప్పలపాడు సర్పంచ్ చిన్నం బీరప్ప, ఆత్మకూర్ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, మజ్జిగ రాంబాబు, కేమిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు దొడ్డి కొమురయ్య త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు.

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

## వివాహేతర సంబంధాల్లో
# రెండో స్థానంలో హైదరాబాద్.. తాజా సర్వేలో..



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మెయిన్ డెస్క్ : ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివాహేతర సంబంధాలు పెరుగుతున్నాయి. ఇంత బిజీ లైఫ్ లోనూ వివాహేతర సంబంధాలు పెరగడానికి చాలా కారణాలే ఉన్నాయి. అయితే వివాహేతర సంబంధాల్లో మన దేశంలో బెంగళూరు తొలి స్థానంలో ఉన్నట్లు గ్లీడెన్ అనే డేటింగ్ యాప్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. వివాహేతర సంబంధాల కోసం మాత్రమే ఏర్పాటు చేసిన ఈ సైట్ లో భారత యూజర్ల సంఖ్య 40 లక్షలు దాటింది. ఈ విషయాన్ని గ్లీడిన్ డేటింగ్ యాప్ వెల్లడించింది.అయితే తాజా సర్వే ప్రకారం మొత్తం యూజర్లలో దాదాపు 18 శాతం ఒక్క బెంగళూరు నుంచే ఉన్నారు. ఇక రెండో స్థానంలో హైదరాబాద్ ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో దిల్లీ, ముంబై, పుణె ఉన్నాయి. ఈ నేపథ్యంలో అర్బన్ నగరాల్లో వివాహేతర సంబంధాలు ఏ విధంగా పెరుగుతున్నాయో అర్థం అవుతోంది. అలాగే దేశంలోని టైర్ 2 నగరాల్లోనూ యూజర్లు పెరుగుతున్నట్లు గ్లీడెన్ సంస్థ తన సర్వేలో వెల్లడించింది. ఇది ఒక కల్చరల్ షిఫ్ట్ గా ఆ డేటింగ్ యాప్ భావిస్తోంది.ఈ యూజర్లలో చాలా మంది ఇప్పటికే పెళ్లి అయినవాళ్లు, లాంగ్ టర్మ్ రిలేషన్ షిప్ ను కొనసాగిస్తున్నవాళ్లే ఉండటం గమనార్హం. ఇక గ్లీడెన్ డేటింగ్ యాప్ ద్వారా ప్రస్తుతం మెట్రో నగరాల్లో విస్తరిస్తున్న కల్చర్ పై స్పష్టత వస్తోంది. ఇక గ్లీడెన్ డేటింగ్ యాప్ లో యూజర్లలో 65 శాతం మంది పురుషులు ఉండగా 35 శాతం మంది మహిళలు ఉన్నారు. అయితే మహిళలు ఈ డేటింగ్ యాప్ లో జాయిన్ అవ్వడం క్రమంగా పెరుగుతోందని గ్లీడెన్ పేర్కొంది. గత రెండేళ్లలో మహిళా యూజర్ల సంఖ్య 148 శాతం పెరిగినట్లు స్పష్టం అవుతోందని తెలిపింది. అయితే ఈ యాప్ లో మహిళలకు ఫ్రీ యాక్సెస్ ఇవ్వడంతోనే ఆ సంఖ్య పెరుగుతుందని ఓ అభిప్రాయం.ఇక గ్లీడెన్ డేటింగ్ యాప్ లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్యలో అలాగే రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో అధిక సంఖ్యలో యూజర్లు యాక్టివ్ ఉంటున్నారు. పురుషులు.. 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్న మహిళలను కోరుకుంటున్నారు. అయితే మహిళలు మాత్రం 30 నుంచి 40 ఏళ్లు ఉండి.. ఆర్థికంగా ఉన్న డాక్టర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, చార్టెడ్ అకౌంటెంట్స్ నే ఎంచుకుంటున్నట్లు గ్లీడెన్ యాప్ స్పష్టం చేసింది.

# భారత్ లో దాడులకు ఆలోచించిన... పాకిస్తాన్ ఎప్పుడు చూడని విధంగా గుణపాఠం చెబుతాం : రాజ్‌నాథ్ సింగ్

## పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్..



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, మెయిన్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది పాకిస్థాన్ పై రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని అడ్డుపెట్టుకుని భారత్ లో పాకిస్థాన్ అలజడులు సృష్టించాలని కుట్రలు పన్నుతోందని.. ఒకవేళ అలాంటివి ఏమైనా పాల్పడితే ఆ దేశానికి భారత్ ఇచ్చే సమాధానం అతి భయంకరంగా ఉంటుందని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పహల్గామ్ దాడి జరిగి ఏడాది కావొస్తున్న సందర్భంగా పాకిస్థాన్ పై రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సైనిక్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్.. ఈ మేరకు పాకిస్థాన్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో నెలకున్న ఉద్రిక్తతలను అడ్డుపెట్టుకుని భారత్ లో ఎలాంటి దాడులకు ప్రయత్నించినా భారత్ రియాక్షన్ పాకిస్థాన్ తట్టుకోలేదని స్పష్టం చేశారు."ప్రస్తుత పరిస్థితుల్లో మన సరిహద్దు దేశం.. భారత్ లో ఏదో సాహసోపేతమైన చర్య చేయాలని ప్లాన్ వేస్తోంది. ఒకవేళ అదే గానీ జరిగితే భారత్ రియాక్షన్ ఊహించుకోలేని విధంగా ఉంటుంది" అని కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో కేవలం 22 నిమిషాల్లోనే భారత్.. ఆ దేశాన్ని ఎలా మోకాళ్లపై కూర్చోబెట్టిందో గుర్తు చేశారు.ఇక జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గామ్ లోయలో గతేడాది ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ ఘటన వెనకున్నట్లు తేలింది. అనంతరం పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. మే 7-10 మధ్య చేపట్టిన ఈ ఆపరేషన్ లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను ఏరివేసింది.భారత సైన్యం ధ్వంసం చేసిన వాటిలో ముజఫరాబాద్ లోని సవాయ్ నాలా క్యాంప్, సిడ్నా బిలాల్ క్యాంప్, కోట్లీలోని గుల్ పూర్ క్యాంప్, భీంబర్ లోని బర్నాలా క్యాంప్, అబ్బాస్ క్యాంప్, సియాల్ కోట్ లోని సర్జాల్ క్యాంప్, మెహమూనా జోయా క్యాంప్, మురిడ్ కే లోని మార్కాజ్ టైబా క్యాంప్, బహావల్ పుర్ లోని మార్కజ్ సుభానల్లా క్యాంప్ ఉన్నాయి. వీటిని భారత్ పూర్తిగా ధ్వంసం చేసింది.

# పాకిస్తాన్‌లో చుక్కలు చూపిస్తున్న పెట్రోల్ ధరలు.. లీటర్ ఎంతంటే!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03 :** ఓ పక్క ఆర్థిక సంక్షోభం.. మరోపక్క పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న ఉద్రిక్తతలు ఏకంగా ఆ దేశాన్ని అతలా కుతలం చేస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచంలో ఎక్కడా లేనతంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఉండగా.. తాజాగా గల్ఫ్ లో సంక్షోభం కారణంగా మరోసారి పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయి. ఎక్కడో కాదు మన పక్క దేశం పాకిస్తాన్ లో.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో పాకిస్తాన్ పై తీవ్ర ప్రభావం పడింది.లీటర్ పెట్రోల్ ధర 42శాతం, డీజిల్ ధర 54 శాతం పెరగడంతో వాహనాలు బయటకు తీయాలంటే భయపడుతున్నారు పాకిస్తానీలు. వార్తా సంస్థ రాయిటర్స్ ప్రకారం..పాకిస్తాన్ లో లీటరు డీజిల్ ధర 54.9శాతం పెరిగి 520.35 పీకేఆర్ (పాకిస్తాన్ రూపాయలు)కు, పెట్రోల్ ధర 42.7శాతం పెరిగి 458.40 పీకేఆర్ కు చేరుకుంది. దీంతోపాటు కిరోసిన్ ధర కూడా లీటరుకు రూ.34.08 పెరిగి రూ.457.80 కి చేరింది. అమెరికా-ఇరాన్ యుద్ధం తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో చమురు సంక్షోభంతో ధరలు పెంచక తప్పడంలేదని అని పాకిస్థాన్ పెట్రోలియం శాఖ చెబుతోంది. నెల రోజులు గడవకముందే పాకిస్థాన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియా వివాదం భారతదేశ పొరుగు దేశంపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందో ఇది సూచిస్తోంది. ఈ భారీ ధరల పెరుగుదల ప్రభావాన్ని కొంత మేర తగ్గించే ప్రయత్నంలో, పాకిస్థాన్ ప్రభుత్వం పెట్రోల్‌పై లెవీని రూ.105 నుంచి రూ.160కి పెంచినట్లు, అలాగే డీజిల్‌పై ఉన్న రూ.55 లెవీని పూర్తిగా సున్నాకు తగ్గించినట్లు రిపోర్టులు చెబుతున్నాయి. మార్చిలో పాకిస్థాన్ డీజిల్, పెట్రోల్ ధరలను సుమారు 20శాతం పెంచగా, ఇప్పుడు వాటిని వరుసగా 55శాతం, 43శాతం మేర మరింత పెంచింది.ఆసియాలోని అనేక దేశాల మాదిరిగానే, పాకిస్థాన్ కూడా తన చమురుకోసం హోర్ముజ్ జలసంధి పైనే ఆధారపడి ఉంది. సౌదీ అరేబియా, యూఏఈల నుంచి పాకిస్తాన్ ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటుంది. హోర్ముజ్ జలమార్గం మూసుకుపోవడం, ఇరాన్ ,అమెరికాల మధ్య కాల్పుల విరమణ ఆశలు సన్నగిల్లడంతో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగి పాకిస్థాన్ ఇబ్బందులు పడుతోంది.పశ్చిమాసియలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించడానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల ముందుకొచ్చారు. ఇరాన్, అమెరికాల మధ్య చర్చలకు ఇస్లామాబాద్ వేదిక కాగలదని పలు వార్తా నివేదికలు కూడా సూచించాయి. అయితే అప్పటి నుంచి ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు.

# కరీంనగర్ లో దారుణం.. కసాయి తండ్రి ఘాతుకానికి ఇద్దరు చిన్నారులు బలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 03, కరీంనగర్ :** కుటుంబ కలహాలతో ఇద్దరు కూతుళ్లను చంపి బావిలో పడేసిన ఘటన కరీంనగర్ మండలం జూబ్లీ నగర్ లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీ నగర్ కు చెందిన గచ్చు శ్రీ శైలం కి గీతం శ్రీ, గీతాన్విక (5) ఇద్దరు కవలపిల్లలు. కుటుంబ కలహాలతో ఇద్దరు చిన్నారులకు గడ్డి మందు తాగించి అనంతరం బావిలో పడేశాడు తండ్రి గచ్చు శ్రీశైలం. శుక్రవారం ఉదయం భార్యతో గొడవపడిన అనంతరం ఈ ఘాతుకానికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. దారుణానికి పాల్పడిన శ్రీశైలంకి స్థానికులు దేహశుద్ధి చేసి కరీంనగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ చిన్నారుల మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.